విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

భక్తి ముసుగులో వ్యాపారం

మానవ సేవే మాధవ సేవ అంటూ కలరింగ్
ప్రభుత్వ ఆదాయానికి గండి
నిండుతున్న అధికారుల జేబులు
చిన్న వీధి సాక్షిగా అక్రమ కళ్యాణ మండపం

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: చేసిన పాపాలు పోవడానికి, లేదా వాటిని కప్పిపుచ్చుకోవడానికి బడాబాబులు, అక్రమ సంపాదనపరులు భక్తి ముసుగు ధరించడం పరిపాటిగా మారిపోయింది. చేసిన పాపాల ద్వారా వచ్చే డబ్బులతో ఎంతో కొంత దైవకార్యానికి ఖర్చు పెడితే పాపం పోతుందనే మూఢనమ్మకాలతో అక్రమ వ్యాపారాలు చేస్తూనే వాటిలో దేవుడుకు కూడా వాటా ఇచ్చేస్తున్నారు. ప్రభుత్వ ఆదాయాలకు గండి కొడుతూ స్థానిక అధికారుల జేబులను నింపుతున్న భక్తి ముసుగు వేషధారుల వింత వైఖరి విచిత్రంగా ఉంది. ఆలయాల పేరుతో కళ్యాణ మండపాలు నిర్మించి వాటికి కార్పొరేట్ స్థా యిలో మెరుగులు దిద్ది భారీ స్థాయిలో అద్దెలు వసూలు చేస్తూ... ఆధ్యాత్మికత అని చెప్పుకోవడం విడ్డూరమే.

కళ్యాణ మండపం అంటేనే వ్యాపారం..

కానీ ఈ భక్తి ముసుగు వేషధారులు మాత్రం ఆధ్యాత్మిక సేవ అంటూ రెసిడెన్షియల్ ఏరియాలో భారీ కమర్షియల్ కళ్యాణ మండపం నిర్మించేశారు. జేబులు దండిగా నిండిపోవడంతో అధికారులు సైతం ఈ ముసుగుదారులకే వంత పాడుతూ తప్పుల మీద తప్పులు చేసేస్తున్నారు. రెసిడెన్షియల్ ప్లాన్‌కి కేవలం నాలుగున్నర లక్షల పైచిలుకు నగదు చెల్లించి ప్లాన్ తీసుకున్నారంటే అర్థం చేసుకోవచ్చు అధికారులు ఏ స్థాయిలో అమ్ముడుపోయారో. అంతేకాకుండా రెసిడెన్షియల్ ఏరియాలో కమర్షియల్ నిర్మాణానికి అసలు అనుమతులు ఇవ్వకూడదు. కానీ రెసిడెన్షియల్ ప్లాన్ తీసుకొని కమర్షియల్ అనుమతులు చేసుకునే విధంగా అధికారులు చేయూతనివ్వడం విశేషం. ఇప్పటికైనా అధికారులు కళ్ళు తెరిచి సదరు నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

హక్కుల పరిరక్షణకు పోరు బాటే శరణ్యం

విశాలాంధ్ర - గాజువాక: హక్కుల పరిరక్షణకు పోరాటాలే శరణ్యమని హైకోర్టు హక్కుల న్యాయవాది పిచ్చుక శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం విదసం ఐక్య వేదిక, నిర్వాసితుల ఐక్య సంఘం, యూనియన్ స్టీల్ ఎంప్లాయిస్‌లు ఆధ్వర్యంలో మంగళవారం లౌకిక వాదం - సవాళ్లు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు పిచ్చుక శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. డా.బి.ఆర్.అంబేద్కర్ ఇచ్చిన హక్కులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వి ద సం ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బూసి వెంకట్రావు ఈ సదస్సుకు అధ్యక్షత వహించి మాట్లాడారు. మనువాద శక్తులు వ్యవస్థలో లౌకిక వాదాన్ని అన్ని వ్యవస్థలలో కూల్చివేతలకు పాల్పడుతున్నాయని ఆక్షేపిం చారు. సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు ఏ.జె.స్టాలిన్ మాట్లాడుతూ వ్యవస్థలు తమ పరిణామ క్రమంలో వాటి రూపాలను మార్చుకుంటూ ఉండడాన్ని గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంద న్నారు. సన్మాన గ్రహీత తుంపాల శ్రీరామ మూర్తి మాట్లాడుతూ అంబేద్కర్‌ని మినహాయించి భారత దేశాన్ని చూడలేమని చెప్పారు. జీవించే హక్కు గురించి మాట్లాడుతూ ఆయన బాల్యం నుంచి జరిపిన పోరాటం, అనుభవాలు, అవమానాలను ఎదుర్కొన్న సవాళ్ళను ఆయన తన మాటల్లో ఉటంకించారు. అంతకు ముందు ఆరు దశాబ్దాల పాటుగా అలుపెరగని సామాజిక సేవలు అందించిన టి.శ్రీరామమూర్తిని వేదిక ఘనంగా సత్కరించింది. వక్తలు ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు కొత్తపల్లి వెంకట రమణ, ఎస్.ఆర్.వేమన, కె.వరంధామయ్య, బూసి పరమేశ్వరి, ఉక్కు ఐక్య సంఘం నాయకులు ఉమ్మడి అప్పారావు, పితాని భాస్కర్, ఏఐటీయూసీ నాయకులు ఏళ్ళేటి శ్రీనివాసరావు, జి.ఆనంద్, నిర్వాసిత నాయకులు బసా సాదురెడ్డి పాల్గొన్నారు.

మధురవాడ జోన్‌లో తాగునీరు, మురుగనీరు ప్రాజెక్టులకు మహర్దశ

రూ.1528.92 కోట్ల జీవీఎంసీ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో మహా విశాఖ నగర పాలక సంస్థ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మంగళవారం రాడిసన్ బ్లూ హొటల్ నందు శంకుస్థాపనలు చేశారు. ముందుగా సభా వేదిక వద్ద ప్రజా ప్రతినిధులు కార్పొరేటర్లను ముఖ్యమంత్రి స్వయంగా కలుసుకొని ఆత్మీయ అభినందనలు తెలిపారు. అనంతరం విశాఖ నగరంలో జీవీఎంసీ ప్రతిపాదించిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ అభివృద్ధి కార్యక్రమాల్లో రూ.595 కోట్ల రూపాయల అంచనాలతో మధురవాడ జోన్ 2 యొక్క పారిశ్రామిక క్లస్టర్లకు, గృహ అవసరాల కోసం 66 ఎంఎల్‌డి నీటి సరఫరాను పెంచే పనులకు, రూ.553 కోట్ల రూపాయల అంచనాలతో జోన్-2 మధురవాడ ప్రాంతంలో సమగ్ర మురుగునీటి వ్యవస్థను నిర్మించడం కోసం, రూ 99.47 కోట్ల రూపాయల అంచనాలతో ముడసర్లోవ ప్రాంతంలో జీవీఎంసీ, విస్కో కోసం కొత్త ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ బిల్డింగ్ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. రూ 231.04 కోట్ల రూపాయల అంచనాలతో అమృత్ కింద జోన్-3, 5, 6 ,8లో (నీటి సరఫరా యూజీడీ) పనులకు, రూ. 15.65 కోట్ల రూపాయల అంచనాలతో పర్యావరణ అనుకూలమైన సాగర్‌నగర్ తాబేలు బీచ్ అభివృద్ధి కార్యక్రమంకు, రూ.34.76 కోట్ల రూపాయల అంచనాలతో జాతీయ రహదారి -16కి సమాంతరంగా గిరి ప్రదక్షణ రహదారి విస్తరణ, అభివృద్ధి కార్యక్రమాలకు, మొత్తంగా ఆరు అభివృద్ధి ప్రాజెక్టులకు రూ. 1528.92 కోట్ల రూపాయల అంచనాలతో ప్రతిపాదిత అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్య మంత్రి శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, రాష్ట్ర మంత్రులు బొత్స సత్యనారాయణ, ఆదిమూలపు సురేష్, విడదల రజిని, గుడివాడ అమర్నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మ శ్రీ, స్పెషల్ చీఫ్ సెక్రటరీ వైస్ శ్రీలక్ష్మి, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజు, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయి కాంత్ వర్మ, అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎంవివి.సత్యనారాయణ, రాజ్యసభ సభ్యులు వైవి.సుబ్బా రెడ్డి, అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సత్యవతి, జడ్పీ చైర్ పర్సన్ సుభద్ర, శాసనసభ్యులు తిప్పల నాగిరెడ్డి, అదీప్ రాజ్, శంకర్ గణేష్, ముత్తంశెట్టి శ్రీనివాస్, శాసనమండలి సభ్యులు వరుదు కళ్యాణి, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటమూరు సతీష్, మొత్తం నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు, వైసిపి విశాఖపట్నం ఎంపీ అభ్యర్థి ఝాన్సీ లక్ష్మి, వైసీపీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాస్, కార్పొరేటర్లు, వైసిపి జిల్లా అధ్యక్షులు కోల గురువులు, వైసిపి సీనియర్ నాయకులు గొలగాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ లేకపోతే ప్రపంచం నడవదు

ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు పి.దామోదరరావు

విశాలాంధ్ర - సింహాచలం: గ్రేటర్ విశాఖ 98వ వార్డ్ సింహాచలం ఆర్టీసీ బస్సు స్టాండ్ వద్ద మార్చ్ 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఏపి పిటిడి (ఆర్టీసి) ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్టీసి విజయనగరం జోన్ మహిళా ఉద్యోగులకు సన్మాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి రాష్ట్ర ఏపి పిటిడి (ఆర్టీసి) ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు పి.దామోదరరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవికుమార్ హాజరై మాట్లాడారు. మహిళలు పురుషులతో సమానంగా పోటీ పడుతున్నారన్నారు. మహిళ లేకపోతే ప్రపంచం నడవదని తెలిపారు. మహిళల్లో మాతృత్వం ఉందన్నారు.

ఎన్ఎస్ఆర్ఐటీలో రోబో రెవల్యూషన్ 4.0

విశాలాంధ్ర - ఆనందపురం: కంప్యూటర్ కాలంలో అన్ని రంగాల్లో దూసుకుపోతున్న తరుణంలో నేటి కంప్యూటర్ యుగంలో మరింత వేగంగా రోబోటిక్స్ ద్వారా భవిష్యత్తును రూపొందించవచ్చని జిఎంఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రొఫెసర్ డాక్టర్ అనిల్ కుమార్ తెలిపారు. 3 రోజుల ఎస్‌సీఈఆర్‌బి ప్రాయోజిత సెమినార్ ఎన్ఎస్ఆర్ఐటీలో మంగళవారం ప్రారంభమైంది. డాక్టర్ శాంత కుమార్ పరిశ్రమ 4.0 యొక్క సూక్ష్మ నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. జిఎంఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఈసీఈ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్. బి.అనిల్ కుమార్ నైపుణ్యంతో మార్గనిర్దేశం చేసిన రోబోటిక్స్ కినిమాటిక్స్ గురించి విద్యార్థులు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.శంభు ప్రసాద్, డైరెక్టర్ జె.రాజా మురుగదాస్, కన్వీనర్ డాక్టర్ పి.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలపై అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: మండలంలో 23 పంచాయతీల ప్రజలకు పోస్టల్ సేవలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని అరకు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ బి.ఉపేంద్ర పోస్టల్ శాఖ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ముంచంగిపుట్టు, కరిముక్కి పుట్ తపాల కార్యాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐపీఓ ఉపేంద్ర మాట్లాడుతూ మండలంలో అన్ని పోస్టల్ బ్రాంచ్ కార్యాలయ పరిధిలో ప్రజలకు పోస్టల్ సేవలపై పూర్తిస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోస్టల్ శాఖలో రకరకాల పొదుపుల విషయమై ప్రజలకు వివరించాలన్నారు. పోస్టల్ శాఖ సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలని పలు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ శాఖ సిబ్బంది ఎస్.గంగారం, బి.ప్రసాద్‌రావు, ఎస్.సురేష్ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సత్కారం

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో ఉప్పరాపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న బొజ్జా అరుణ త్రివేణిని ఘనంగా సత్కరించారు. అనకాపల్లి జిల్లా నుంచి ఎంటర్ ప్రెన్యూర్ షిప్ మైండ్ సెట్ డెవలప్మెంట్ ప్రోగ్రాం (ఈఎండిపి)లో రాష్ట్రస్థాయికి ఉపాధ్యాయురాలు ఎంపిక అవడంతో మండల పిఆర్‌టియు ఆధ్వర్యంలో ఆమెను సత్కరించడంతో పాటు సహకరించిన ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు కే.సంపత్‌ను సన్మానించారు. రాష్ట్ర స్థాయిలోని ప్రథమ స్థానంలో నిలిచి జిల్లాకు మరింత పేరు తీసుకురావాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు మండల అధ్యక్షుడు భద్రరావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల వేతన జీవో అమలు చేయాలి



విశాలాంధ్ర - ఎలమంచిలి: మున్సిపల్ కార్మికుల వేతనాల పెంపు సంబంధించిన జీవోలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరుతూ మంగళవారం మున్సిపల్ కార్మికులు నిరసన తెలియజేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జేసుదాసు ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కొండలరావుకు వినతిపత్రం అందజేశారు. జీవోఎంఎస్ నెంబర్ 36 ప్రకారం 21,000, డ్రైవర్లకు 20,500 పెంచాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో నూకరాజు, వెంకటరమణ మహేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ పెన్షనర్స్‌కు మెడికల్ సౌకర్యం కల్పించాలి



విశాలాంధ్ర - పెదగంట్యాడ: పెదగంట్యాడ సిడబ్ల్యూఈపీఎఫ్ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ సమావేశం కనితి అప్పలరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు కే.ధీనబంధు హాజరై మాట్లాడారు. కనీసం 9000 ఇవ్వాలని, దానికి అనుగుణంగా డీఏ కూడా ఇవ్వాలని, మెడికల్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నమ్మి అప్పలనాయుడు, సీశెట్టి అప్పారావు, నలువు వెంకటరావు, ఎన్ని రమణ, సోమిరెడ్డి అప్పారావు, సన్యాసిరావు,కణితి అప్పలరాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీస్

విశాలాంధ్ర - అనంతగిరి: మండలంలో గల మారుమూల బుద్దిగరువు పాఠశాలలో నాడు నేడు నిధులు దుర్వినియోగమైనట్లు విశాలాంధ్ర పత్రికలో వెలువడిన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. ముందుగా నిర్మాణ దశలో ఉన్న పాఠశాల వద్దకు వెళ్ళి విచారణ చేపట్టిన మండల విద్యాశాఖ అధికారి బాలాజీ ఉపాధ్యాయుడు జాకీరు సత్యనారాయణకు షోకాజ్ నోటీసును జారీ చేసినట్లుగా చెప్పారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరుగుతుందని ఆయన తెలిపారు. ఎటువంటి అవకతవకలకు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పనులలో నాణ్యత లోపించిన నిధులు దుర్వినియోగం గుర్తించిన తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

జయహో బీసీకి తరలిన టీడీపీ శ్రేణులు

విశాలాంధ్ర - పాయకరావుపేట: టీడీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, పాయకరావుపేట నియో జకవర్గం టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు మంగళగిరిలో జరిగే జయహో బీసీ కార్యక్రమానికి పాయకరావుపేట మండల ప్రధాన కార్యదర్శి బొంది కాశీ విశ్వనాథ్, చింతకాయల రాంబాబు ఆధ్వర్యంలో ఇక్కడి నుంచి తరలి వెళ్లారు. ఈ కార్యక్రమానికి టీడీపీ మండల అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు జెండా ఊపి ప్రారంభించారు. తరలి వెళ్లిన వారిలో నాయకులు సిరిపిన సత్యనారాయణ, దువ్వు శ్రీనివాస్, మలిపెద్ది సతీష్, లక్ష్మణ్, వంకా ప్రసాద్, చొక్కా కృష్ణ, పల్లా శ్రీను, మోసా సతీష్, బుద్దాల శ్రీను, వంకా హరి, పాలిక ముసలి, పెంకే రాము, నేమాల నాగేశ్వరరావు, నేమాల చిన్న, యాదల సత్తిబాబు తదితరులు ఉన్నారు.

వేంపాడు హైస్కూల్లో యోగాపై శిక్షణ

విశాలాంధ్ర - నక్కపల్లి: మండలంలోని వేంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం యోగా శిక్షణా తరగతులను ప్రారంభించారు. హెచ్ఎం నర్సింగరావు, పీఈటీ రాం కుమార్, వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అభినయ్‌కుమార్ ఆధ్వర్యంలో యోగా శిక్షణా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. యోగా శిక్షకుడు దవరసింగి రాంబాబు పిల్లలకు పలు ఆసనాలు, ప్రాణాయామంపై శిక్షణ ఇచ్చారు.

నూకాలమ్మ అమ్మవారి పండగ

విశాలంధ్ర - అచ్యుతాపురం: మండలంలో మడుతూరు గ్రామదేవత శ్రీ నూకాలమ్మ అమ్మవారి పండుగ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని మాజీ డిసిసిబి చైర్మన్ యు.సుకుమార్ వర్మ (తేజ) దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.93కోట్లు

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరహ లక్ష్మీనృసింహ స్వామివారి హుండీ ఆదాయం రూ.1,93,77,877లు నగదు లభించింది. భక్తులు స్వామివారికి ముడుపులు, మొక్కుబడులుగా హుండిలో బంగారం 000.136.350 మిల్లి గ్రాములు, వెండి 11 కెజిల 450 మిల్లి గ్రాములు, యు.ఎస్.ఏ 277 డాలర్లు, యు.ఏ.ఇ 125 దిరంస్, సింగపూర్ 4 డాలర్లు, ఇంగ్లాండ్ పౌండ్స్ 20, మలేషియా రింగెట్స్ 124, ఒమన్ రియల్ 800, సౌదీ అరేబియా రియల్ 30, కువైట్ దినార్ 1, నేపాల్ 85 రూపాయిలు విదేశీ కరెన్సీ భక్తులు సమర్పించినట్లు కార్యనిర్వహణాధికారి ఎస్. శ్రీనివాసమూర్తి తెలిపారు. హుండి లెక్కింపులో దేవస్థానం సిబ్బందితోపాటు శ్రీహరి, శ్రీవారి సేవా సంస్థలు పాల్గొన్నాయి.

ఉచిత మెడికల్ క్యాంపు

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం గ్రామంలో ఎన్టీఆర్ సేవ, ఎంవివిఎస్ మూర్తి స్ఫూర్తితో గీతం విద్యా సంస్థలు అధినేత ఎం.శ్రీ భరత్, భీమిలి టిడిపి ఇన్‌ఛార్జి కోరాడ రాజాబాబు ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఎంపీటీసీ కె.లక్ష్మీ నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు కోరాడ రమణ, మండల ఎక్స్ జెడ్పీటీసీ కసిరెడ్డి దామోదరరావు, మండల యువత అధ్యక్షులు కాళ్ళ సత్యనారాయణ, మండల మాజీ అధ్యక్షులు కాళ్ళ నగేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి అవాల గంగరాజు, మాజీ సర్పంచ్ రామసింగు సన్యాసిరావు, టీడీపీ సీనియర్ నాయకులు పైల శ్రీను, వైస్ ప్రెసిడెంట్ చింతపల్లి నారాయణరావు, మండల ఐటీడీపి అధ్యక్షులు సంగు శ్రీను, బూత్ కన్వీనర్ చాలపాక ఆచార్య, కంటుబోతు సుమంత్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏయూను సందర్శించిన వెస్టన్ ఆస్ట్రేలియా ప్రతినిధి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని వెస్టన్ ఆస్ట్రేలియా గ్లోబల్ ఎంగేజ్మెంట్ మేనేజర్ బ్రోడెరిక్ మోనెఫ్ సందర్శించారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల విభాగం పూర్వ డీన్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావులతో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా ఏయూ వెస్టన్ ఆస్ట్రేలియా కార్నర్ ఏర్పాటు చేయడం, సంయుక్తంగా కోర్సుల నిర్వహణ, విద్యార్థుల భాగస్వామ్యం చేయడం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఏయూలో ఎంతో శక్తివంతమైన ఫార్మశీ కళాశాల, సైన్స్, ఆర్ట్స్, న్యాయ కళాశాల ప్రత్యేకతలను రిజిస్ట్రార్ వివరించారు. ఈ సందర్భంగా ఏయూలో నూతనంగా నిర్మించిన ఎలిమెంట్ భవనం, ఆ హబ్‌ను బ్రోడెరిక్ సందర్శించారు. ఏయూలో జరుగుతున్న అభివృద్ధికి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏయూ తరపున బ్రోడెరిక్ ను రిజిస్ట్రార్ సత్కరించారు.

గీతంలో జాతీయ భద్రతా దినోత్సవం

విశాలాంధ్ర - మధురవాడ: పని చేసే ప్రదేశంలో భద్రతను పెంపొం దించడానికి, ఉద్యోగస్తులు తమ జీవన విధానంలో భద్రత, ఆరోగ్య రక్షణ ఒక భాగంగా మలచుకునేలా అవగాహన కలిగించడానికి జాతీయ భద్రత వారోత్సవాలలో భాగంగా భారత నౌకాదళం (ఐఎన్ఎస్ కలింగ్) మరియు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం భద్రత దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయనంద సిద్దవట్టం ముఖ్యఅతిధిగా హాజరై ప్రారంభించారు. బహుళ అంతస్తులు, టెక్నాలజీ విభాగాలు, విద్యుత్ సర్క్యూట్‌ల విషయంలో ప్రతి ఒక్కరు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా భారత నౌకాదళం భద్రత విభాగం అధికారులు లెఫ్ట్‌నెంట్ కమాండర్ జి.నరేష్, లెఫ్ట్‌నెంట్ లింక హాజరై అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తులపై నమూనా ప్రదర్శన చేసారు. కార్యక్రమంలో గీతం సీనియర్ విజలెన్స్ అండ్ సెక్యూరిటీ డైరక్టర్ బి.వి.రమణకుమార్, గీతం సెక్యూరిటీ విభాగాధిపతి రామాంజ నేయులు, గీతం సేఫ్టి విభాగం ఆధికారి కె.పి.చక్రధర్, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు పటిష్టంగా ఏర్పాట్లు

విశాలాంధ్ర - కశింకోట: ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లను అధికారులు మంగళవారం పరిశీలించారు. తొలుత కశింకోట ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో హెలిప్యాడ్ ప్రాంతాన్ని, పిసినికాడ సభ స్థలాన్ని పరిశీలించి సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలక్టర్ రవి పట్టాన్ శెట్టి సమావేశం నిర్వహించి ముఖ్యమంత్రి పర్యటన ముందస్తు ఏర్పాట్లపై అధికారులకు తగు సూచనలు చేశారు. సీఎం జగన్ ఈ నెల 7న పిసినికాడ హైవే ప్రక్కన 4వ విడత చేయూత నిధులను ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి బటన్ నొక్కి విడుదల చేయబోయే సభా ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి, విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్నీ, ముఖ్యమంత్రి ఇంటిలిజెన్సీ సిబ్బంది పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రొటోకాల్ ప్రకారం బందోబస్తు ఏర్పాట్లు చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ తెలిపారు. స్పెషలిస్ట్ డాక్టర్లను, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని అధికారులను ఆయన ఆదేశించారు.

విశాఖ అభివృద్ధికి దృఢ సంకల్పంతో సీఎం

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్

విశాలాంధ్ర - పెందుర్తి: విశాఖ మహా నగరాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృఢ సంకల్పంతో ఉన్నారని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ స్పష్టం చేశారు. జీవీఎంసీ నిధులు 50 లక్షలతో జోన్ 8 కార్యాలయం అభివృద్ధి, బి.ఆర్.టి.యస్ ప్రధాన రహదారి నుండి పాపయ్య రాజు పాలెం ఆర్.టి.సి లే అవుట్ వరకు 32.48 లక్షలతో తారు రోడ్డు నిర్మాణం, ఓపెన్ జిమ్స్ నిర్మాణం నిమిత్తం 38.54 లక్షలతో 4 పనులకు కార్పొరేటర్ ముమ్మన దేముడుతో కలిసి ఆయన మంగళవారం ఉదయం శంకుస్థాపన చేశారు. ఎవరు ఎన్ని జిమ్మిక్కులు చేసినా వచ్చే ఎన్నికల్లోను భారీ మెజారిటీతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని దక్కించుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక కార్పొరేటర్ ముమ్మన దేముడు 95వ వార్డు అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హేమావతి, ఇతర అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోండి: జేసీ

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: ప్రతి ఓటరూ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సంయుక్త కలెక్టర్ భావన వశిష్ట్ పిలుపునిచ్చారు. చింతపల్లి మండలంలోని 16 పోలింగ్ కేంద్రాలను జేసి పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో గల ప్రజలతో మాటాడి ప్రతి ఓటరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఆయా పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల నిబంధనల మేరకు కనీస సౌకర్యాలు ఉన్నదీ లేనిదీ పరిశీలించి తగు సూచనలు జారీ చేసారు. ముఖ్యంగా మావోఇస్టు ప్రభావిత ప్రాంతాలైన బలపం, రాళ్ళ గెడ్డ, అన్నవరం, తదితర ప్రాంతాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ పర్యటనలో చింతపల్లి ఎన్నికల ఉప తహసిల్దార్, రాజ్ కుమార్, సెక్టోరల్ అధికారులు, రూట్, జోనల్ అధికారులు,బూత్ లెవెల్ అధికారులు, పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ నగరంలో రెండు వేర్వేరు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మంగళవారం విశాఖపట్నం విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఘన స్వాగతం లభించింది. తాడేపల్లి నుంచి విశాఖ విమానాశ్రయానికి చేరుకొని అక్కడ నుంచి మధురవాడ ఐటీ హిల్స్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. విశాఖ విమానాశ్రయం వద్ద ఇన్‌ఛార్జి మంత్రి విడదల రజని, ఎంపి ఎం.వి.వి. సత్యనారాయణ, విప్ కరణం ధర్మశ్రీ, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జిల్లా కలెక్టర్ డా. ఎ.మల్లిఖార్జున, వి.ఎం.ఆర్.డి.ఎ. చైర్మన్ సనపల చంద్రమౌళి, డీసీసీబి చైర్మన్ కోలా గురువులు, డీసీపీ సత్తిబాబు తదితరులు పుష్ప గుచ్చాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని ఉన్నారు.

చిక్కుడు బట్టి రహదారికి తొలగనున్న చిక్కులు

విశాలాంధ్ర - చింతపల్లి: మండలంలోని గొందిపాకల పంచాయతీ చిక్కుడు బట్టి గ్రామంలో నెలకొన్న రహదారి చిక్కులు వైసీపీ ప్రభుత్వ హయాంలో తొలగనున్నాయని పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి అన్నారు. గొంది పకల నుంచి చిక్కుడుబట్టి వరకు నిర్మాణం జరిగిన బీటీ రోడ్డును మంగళవారం ఆ పంచాయతీ సర్పంచ్ సాగిన వరలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు మోహనరావులతో కలిసి ఆమె ప్రారంభించారు. రూ.50 లక్షల నిధులతో నిర్మాణం జరిగిన ఈ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఒకపక్క సంక్షేమానికి ప్రాధాన్యతిస్తూనే మరోపక్క అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న ప్రభుత్వం తమ ప్రభుత్వం అని చెప్పుకోవడానికి గర్వపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బోయవీధిలో టైలరింగ్ కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి జోన్ 3వ వార్డు బోయవీధిలో ఉన్న సామాజిక భవనంలో సకల్య అనే స్వచ్ఛంద సంస్థ ఆర్థిక సహాయంతో నిర్వహించిన టైలరింగ్ కేంద్రాన్ని మంగళవారం బోయవీధి గ్రామ పెద్దలు కాసరపు దుర్గారావు, కొక్కిరి కాశీదు, అరసవిల్లి పోలిరాజు, చింతల ఎల్లయ్యలు సంయుక్తంగా ప్రారంభించారు. సకల్య సంస్థ మన గ్రామానికి అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సకల్య సంస్థ ప్రతినిధులు సిస్టర్ మాటిల్డ, సిస్టర్ షకీల, జ్యోతి, జాలారుల సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన అవసరం



విశాలాంధ్ర - పరవాడ: క్యాన్సర్ వ్యాధిపై అవగాహన అవసరమని విశాఖ ఫార్మాసిటీ డీజీఎం గిరిదర్‌రావు భక్షి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహాత్మా గాంధీ క్యాన్సర్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వారి సహకారంతో విశాఖ ఫార్మాసిటీ కమర్షియల్ హబ్‌లో ఫార్మా మహిళా ఉద్యోగులకు మంగళవారం క్యాన్సర్‌పై అవగాహన, స్క్రీనింగ్ పరీక్షల వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రథమ దశలో క్యాన్సర్ వ్యాధిని గుర్తించి చికిత్స అందిస్తే అరికట్టవచ్చున్నారు. బుధవారం కూడా ఈ స్క్రీనింగ్ వైద్య పరీక్షలు కొనసాగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాంకీ ఫౌండేషన్ హెడ్ శ్రీకాంత్, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉచిత కరెంట్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - మారేడుమిల్లి: కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని రాజమహేంద్రవరం సూపరిటెండ్ ఆఫ్ పోస్టల్ అధికారి పి.కోమల్ కుమార్ కోరారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ తమ పేర్లను సమీప తపాలా కార్యాలయంలో నమోదు చేసుకోవాలన్నారు. ఇప్పటికే పోస్టల్ శాఖ సర్వే నిర్వహిస్తుందని తెలిపారు. ప్రతి ఇంటికి 300 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ అందిస్తుందని, 150 యూనిట్లు వినియోగానికి ఒక కిలో వాట్స్ సామర్థ్యం గల సోలార్ ప్యానల్‌ను ఇన్స్టాల్ చేసుకోవాలని తెలిపారు. ఇందుకు రూ.55 వేలు నుంచి 65 వేలు వరకు వ్యయం అవుతుందన్నారు. ఒక కిలో వాట్స్ కి కేంద్ర ప్రభుత్వం రూ.30 వేలు వరకు రాయితీ కల్పిస్తుందని తెలిపారు. సొంత ఇల్లు ఉన్నవారు అందరూ ఈ పథకానికి అర్హులే అన్నారు. వివరాలు కోసం రంపచోడవరం డివిజన్ ఏంవో ఈశ్వర్ 9000580560, 9642431898 530 ఫోన్ నెంబర్లులను సంప్రదించాలని కోరారు.

పెందుర్తి అసెంబ్లీ ఇండిపెండెంట్ అభ్యర్థిగా "సీనియర్ జర్నలిస్ట్" ఉదయకుమార్

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి నియోజకవర్గంలో గత 30 సంవత్సరాలుగా జర్నలిస్టుగా పనిచేస్తున్న వడ్డాది ఉదయకుమార్ ఈసారి ఎన్నికల్లో ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయడానికి సంసిద్ధులవుతున్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కొద్ది రోజుల్లోనే ఉదయకుమార్ తన రాజకీయ ఆరంగ్రేటం, అలాగే కార్యాచరణ ప్రణాళికను ప్రకటించనున్నారు. బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన ఉదయకుమార్‌కు బ్రాహ్మణ సామాజిక వర్గం బ్రాహ్మణ సంఘాలు మద్దతుతో పాటు నియోజకవర్గంలో గల మిగిలిన సామాజిక వర్గ ప్రజానీకంతో కూడా అత్యంత సన్నిహితంగా మసులుతూ మంచిపేరు పొంది ఉన్నారు. పెందుర్తి నియోజకవర్గ పరిధిలో గల పెందుర్తి, పరవాడ, సబ్బవరం మండలంలో పలు సమస్యలు ప్రజలు ఎదుర్కొంటున్నారని వీటిని శాశ్వత పరిష్కారం చేయడానికి ప్రణాళిక రూపొందిస్తున్నారు. రెండు మూడు రోజుల్లోనే ఉదయకుమార్ తన రాజకీయ భవిష్యత్తు గురించి ప్రత్యేక మీడియా ప్రత్యేక సమావేశంలో ప్రకటించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

అడవిలో ప్లాస్టిక్ నిషేధం

విశాలాంధ్ర -మారేడుమిల్లి: మండలంలో పర్యాటక ప్రదేశాల్లో సోమవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో డిఎఫ్ఓ జి జి నరేంద్రన్ ఆదేశాలు మేరకు పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, మద్యం సీసాలు సేకరించి పూడ్చి పెట్టడం జరిగిందని ఎఫ్ఆర్ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇక మీదట మారేడుమిల్లి వొచ్చే పర్యాటకు, పబ్లిక్ అడవిలోకి ఎటువంటి ప్లాస్టిక్, మద్యం బాటిల్స్ తీసుకువెళ్ల రాదని, అడవిలో అగ్ని రగిల్చిన అటవీ శాఖ తీస్కునే చట్టలకు బాధ్యులవుతారని ఈ సందర్బంగా పేర్కొన్నారు.

వైభవంగా ఆంజనేయ స్వామి వార్షికోత్సవం

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో ముఖ్య వ్యాపార కేంద్రమైన అడ్డు రోడ్డు తిమ్మాపురం గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. గత రెండు రోజులుగా ఆలయ వార్షికోత్సవ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం తమలపాకులతో పూజ ఏర్పాటు చేయడంతో గ్రామంలోని మహిళలు వచ్చి పూజ చేశారు. అనంతరం వర్తక సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధనకు భక్తులు వచ్చి అన్నప్రసాదాలు స్వీకరించారు.

జై జవాన్ ఫౌండేషన్ ద్వితీయ వార్షికోత్సవం

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం గ్రామంలో కుప్ప రాజశేఖర్ , రామలక్ష్మి దంపతులు ఫౌండేషన్ సభ్యులు జై జవాన్ ఫౌండేషన్ స్థాపించి నేటికీ 2 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వేములవలస జంక్షన్ లో మంగళవారం సుమారు 300 మంది పేదలకు ఆహారాన్ని అందించారు. జై జవాన్ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ ముడసల శ్రీను మాట్లాడుతూ జై జవాన్ ఫౌండేషన్ స్థాపించి 2 సంవత్సరాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ ఎంతో మందికి సహాయ సహకారాలు అందిస్తూ మెడికల్ క్యాంపులు రక్తదాన శిబిరాలు ఏర్పాటు ఎంతోమందికి పలు సేవా కార్యక్రమాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ముడసల శ్రీను, సెక్రెటరీ ముడసల కార్తీక్, ట్రెజరీ కుప్ప రామలక్ష్మి, జనరల్ సెక్రెటరీ ఇమంది శ్రీనివాసరావు, ఫౌండేషన్ మెంబెర్స్ రాము, వంశీ, శ్రీను, బద్రి, శ్యామ్, కుమార్, శశి, స్వామి, మధు, లక్ష్మి చిన్నరాజు, పెద్దరాజు శివ పాల్గొన్నారు.

ఆగ్నేయాసియా దేశాలకు స్కూట్ విమానాలు

విశాలాంధ్ర -విశాఖ సిటీ: సింగపూర్ ఎయిర్‌లైన్స్ (ఎస్ ఐ ఏ) యొక్క తక్కువ-ధర అనుబంధ సంస్థ అయిన స్కూట్ ఈ రోజు ఆరు ఆగ్నేయాసియా గమ్యస్థానాలను ఆవిష్కరించిందని ఆ సంస్థ ప్రతినిధి చెప్పారు. స్కూట్ కొత్త ఎంబ్రేయర్ ఈ190 ఈ 2 విమానాల సముదాయం ఈ గమ్యస్థానాలకు ప్రయాణిస్తుందన్నారు. వీటిలో మలేషియా థాయ్‌లాండ్‌లో ఇప్పటికే ఉన్న హాట్ యాయ్, క్వాంటన్, క్రాబి మిరితో సహా కొత్త గమ్యస్థానాలు కో స్యామ్యూయ్, సిబు ఉన్నాయన్నారు. స్కూట్ యొక్క ఈ 190 ఈ 2 సేవలు బ్రెజిల్‌లోని సావో జోస్ దాస్ కాంపోస్‌లోని ఎంబ్రేయర్ తయారీ కేంద్రం నుండి ఏప్రిల్‌లో తొమ్మిది విమానాలలో మొదటిది డెలివరీ చేయబడిన తర్వాత, మే 2024లో ప్రారంభమవుతుందన్నారు. ఈ విమానాలతో, స్కూట్ ఎస్ ఐ ఎ గ్రూప్ యొక్క పరిధిని ఆగ్నేయాసియాలోని నాన్-మెట్రో నగరాలకు సామర్థ్యాలను బలోపేతం చేస్తూ సింగపూర్‌కు సింగపూర్ నుండి నేరుగా కనెక్షన్‌లను అందించగలదని చెప్పారు.

కవర్ట్, హైటర్ల సమాధులకు భద్రత కల్పించాలి

విశాలాంధ్ర - నర్సీపట్నం: జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు మంగళవారం నర్సీపట్నంలోని కవర్ట్, హైటర్ల సమాధుల వద్ద అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను కోటనందూరు అల్లూరి సీతారామరాజు సేవా కమిటీ అధ్యక్షులు లక్కాకుల బాబ్జి ఆధ్వర్యంలో పరిశుభ్రం చేసే కార్యక్రమం చేపట్టారు. అల్లూరి సీతారామరాజు సేవా సంఘం, అనుబంధ సంఘాల కార్యవర్గ సభ్యులందరూ పాల్గొన్నారు. నర్సీపట్నంలో వున్న అల్లూరి స్మారక చిహ్నాలుగా వున్న హెవర్ట్ .కోవర్ట్ సమాధుల ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని అన్నారు.

ఘనంగా రాజుల బాబు పండగ

విశాలాంధ్ర - రంపచోడవరం: భక్తి విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే రాజుల బాబు పండగను రంపచోడవరం శివారు రంప వెళ్లే మార్గంలోని నగలమ్మ గుడి సమీపంలో ఘనంగా భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఏటా వేసవిలో దేవతలకు నైవేద్యం ఇచ్చుకోవటంను సాంప్రదాయంగా భావిస్తారు. ఇందులో భాగంగా మంగళవారం పూజలు అనంతరం సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏ.వెంకటేశ్వరరావు, భద్రరావు, ఏ.వి. ప్రసాద్, ఏ.కిషోర్, ఏ.భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఏర్పాట్లు పరిశీలన

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: రాజవొమ్మంగి మండలం జడ్డంగి గ్రామంలో వెలసిన శ్రీ భ్రమరాంబిక మల్లిఖార్జున స్వామి దేవాలయం వద్ద జరిగే శివరాత్రి వేడుకల ఏర్పాట్లును రాజవొమ్మంగి సీఐ సన్యాసినాయుడు మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులతో మాట్లాడుతూ సుదీర్ఘ ప్రాంతాలు నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని, పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేయాలని, స్నాన ఘట్టాలు దగ్గర మహిళలకి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈయన వెంట జడ్డంగి ఎస్ఐ టి.రఘునాదరావు, మండల వైసీపీ అధ్యక్షుడు సింగిరెడ్డి రామకృష్ణ, సర్పంచ్ కొంగర మురళి కృష్ణ, గణజాల తాతారావు పాలొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలన

విశాలాంధ్ర - మారేడుమిల్లి: మండల కేంద్రమైన మారేడుమిల్లిలోని జిల్లా కలెక్టర్ విజయ సునీత గురుకుల జూనియర్ కళాశాలలో జరిగే ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కల్గకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని చీఫ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా చర్యలు చేపట్టాలని యాజమాన్యంకు సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ వీఆర్వో తదితరులు ఉన్నారు.

రేషన్ కార్డుదారులకు రాగి పిండి పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా లోని రేషన్ కార్డ్ దారులకు ప్రజా పంపిణీ వ్యవస్త ద్వారా ఇస్తున్న బియ్యము, పంచదార, కందిపప్పు గోధుమ పిండి లకు అదనముగా ఈ నెల నుండి 1 కేజీ రూ.11 .00 లకు బియ్యమునకు బదులుగా పోషకాహార ములు కలిగిన రాగి పిండి ను అందజేయునున్నట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ తెలిపారు. ఒక్క కేజీ రాగి పిండికి పోను మిగిలిన బియ్యము ఉచితముగా కార్డు దారులు వారి కేటాయింపును బట్టి పొందవచ్చు నన్నారు. కావున జిల్లా లోని కార్డుదారులు ఈ అవకాశమును వినియోగించుకొని బియ్యములో పాటు రాగి పిండి, కంది పప్పు, చక్కెర గోధుమ పిండి మార్చి నుండి పొందవచ్చునని తెలిపారు.

ఉడాన్‌పై 2.25 బిలియన్లకు పైగా ఉత్పత్తులు రవాణా

విశాలాంధ్ర - విశాఖ సిటీ: భారతదేశంలో అతిపెద్ద ఈ బిజినెస్ టు బిజినెస్ ప్లాట్‌ఫారమ్ అయిన ఉడాన్ , కరెంట్ ఇయర్ 2023లో తమ ప్లాట్‌ఫారమ్ ద్వారా 23 మిలియన్లకు పైగా ఆర్డర్‌ల ద్వారా 2.25 బిలియన్లకు పైగా ఉత్పత్తులను రవాణా చేసినట్లు ఈరోజు వెల్లడించింది. ఈ ఆర్డర్‌లు భారత దేశంలోని అన్ని రాష్ట్రాలకూ రవాణా చేయబడ్డాయి. ఎసెన్షియల్స్ కేటగిరీ (ఫ్రెష్, ఎఫ్ఎంసిజి, స్టేపుల్స్, ఫార్మా) కింద ప్లాట్‌ఫారమ్ 20 మిలియన్ ఆర్డర్‌లను అందించింది. ప్లాట్‌ఫారమ్ ద్వారా దాదాపు 10 లక్షల టన్నుల ఉత్పత్తులు రవాణా చేయబడ్డాయి. విచక్షణ (ఎలక్ట్రానిక్స్, జనరల్ మర్చండైజ్ మరియు లైఫ్‌స్టైల్) కేటగిరీ కింద 70 మిలియన్లకు పైగా ఉత్పత్తులను 3 మిలియన్లకు పైగా ఆర్డర్‌ల ద్వారా రవాణా చేయటం జరిగింది. ఈ కాలంలో, ఈ ప్లాట్‌ఫారమ్‌లో 900 మంది అమ్మకందారులు ఒక్కొక్కరు రూ. 1 కోటి విలువైన అమ్మకాలను సాధించిందని ఉడాన్ సహ వ్యవస్థాపకుడు వైభవ్ గుప్తా అన్నారు.

గ్రామ సచివాలయ వ్యవస్థతో పారదర్శక పాలన

విశాలాంధ్ర - చింతపల్లి: దేశంలోనే ఎక్కడా లేని విధంగా పారదర్శక పాలన అందించేందుకుగాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో గ్రామ సచివాలయ, వాలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చారని వైకాపా అరకు పార్లమెంట్ సమన్వయ కర్త, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. చింతపల్లి మండలంలోని చౌడుపల్లి-2 గ్రామ సచివాలయం పరిధిలో రైతు భరోసా కేంద్రాన్ని, గొందిపాకలు గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను మంగళవారం ఆమె లాంఛనంగా ప్రారంభించారు. పాడేరు నియోజక వర్గంలో 97 సచివాల యాలకు గాను 68 సచివాలయాలను తన చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసుకోవడం సంతోషకరమన్నారు. గొందిపాకలు గ్రామపంచా యతీకే 16 కోట్ల 32 లక్షల రూపాయలు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వెచ్చించిందన్నారు. గతంలో ఈ మాదిరిగా ఇన్ని కోట్లు ఖర్చుపెట్టగలిగామని ఏ పాలకుడైనా చెప్పగలరా? అని ప్రశ్నించారు.

అవార్డులు బాధ్యతలను పెంచుతాయి

విశాలాంధ్ర - గాజువాక: అవార్డులు బాధ్యతలను పెంచుతాయని తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం చీఫ్ అడ్వైజర్, ఉక్కు జనరల్ మేనేజర్ ఎన్.వీరేశం అన్నారు. ఇటీవల ప్రతిష్టాత్మకమైన జవహర్ లాల్ నెహ్రూ అవార్డులు అందుకున్న విజేతల ఆత్మీయ సత్కార కార్యక్రమం మంగళవారం ఉక్కు నగరం సీ భవన్‌లో జరిగింది. తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జి.ఎం వీరేశం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ ఏడాది తమ సంఘం సభ్యులైన జి.ఎన్ రావు, బి.ఎస్.ఎస్ దుర్గా ప్రసాద్, జి.మల్లేశం, రాములు, శివాజీ, ఎస్.గణపతిలకు జె.ఎన్. అవార్డులు లభించాయని అన్నారు. ఎన్.కుమార స్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జి.ఆనంద్, వర్కింగ్ ప్రెసిడెంట్ బి. వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షులు ఎం.కె .వి.ఆర్ మోహన్ రావు, కోశాధికారి ఎన్.నర్సింగరావు, ప్రతినిధులు జె.శ్రవణ్ కుమార్, ఎం.గోపాల్, టి.ప్రభాకర్, అనిల్, ఎం.లక్ష్మణ్, బోడ రంగ, ఎం.చంద్ర శేఖర్, బి.గణేష్ పాల్గొన్నారు. కార్యక్రమం లో జె.ఎన్.అవార్డు గ్రహీతలను సత్కరించారు.

భద్రతా ప్రమాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలి

విశాలాంధ్ర - పరవాడ: పరవాడ జవహర్ లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో భద్రతా ప్రమాణాలకు ప్రాధాన్యతను ఇవ్వాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. 53వ జాతీయ భద్రత దినోత్సవంలో భాగంగా మంగళవారం ఫార్మాసిటీలో సిఐటియు ఆధ్వర్యంలో విజయశ్రీ నుండి ఐటీసీ బాట్లింగ్ ప్లాంట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. భద్రతను పాటిద్దాం.. ప్రాణాలను కాపాడుకుందాం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ ఫార్మాసిటీలో భద్రతా వారోత్సవాలు నిర్వహించడంతో పాటు కార్మికులకు భద్రతా పరికరాలు ఇచ్చేలా యాజమాన్యాలు కృషి చేయాలన్నారు. గతంలో భద్రతా ప్రమాణాల లోపాల వలన సాయినార్ పరిశ్రమలో కార్మికుడు మృతి చెందగా అనేక మంది కార్మికులు గాయపడ్డారని అదే పరిశ్రమ యాజమా న్యానికి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ కోటి రూపాయలు జరిమానా విధించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కె.అప్పలరాజు, జి.చిట్టి బాబు, ఎస్.అప్పలనాయుడు, ఎం.కొండ బాబు తదితరులు పాల్గొన్నారు.

పెదగాడిలో చెరువు కబ్జాకు వైసీపీ నేత ప్రయత్నం

విశాలాంధ్ర - పెందుర్తి: మండలంలోని పెదగాడి పంచాయతీలో చెరువును కబ్జా చేసి ఇళ్ల ప్లాట్లుగా విక్రయించేందుకు వైసీపీ నేత ప్రయత్నిస్తున్నారని ఆ గ్రామానికి చెందిన పలువురు యువకులు మీడియాకు వెల్లడించారు. గ్రామంలోని సర్వే నెంబర్ 70 గల చెరువును గుడి నిర్మాణం పేరుతో చదును చేయించారని, అయితే అందులోనే పలువురికి ఇల్లు స్థలాలు విక్రయించారని తెలిపారు. దీనిపై తాము జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, ఆయన ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు 7 నోటీసులు ఇచ్చా రని చెప్పారు. అయితే ఆ తర్వాత 6 నోటీసులు ఇవ్వాల్సి ఉండగా పది రోజులు గడిచినప్పటికి స్థానిక రెవిన్యూ అధికారులు స్పందించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాక ప్రభుత్వ స్థలంలో ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వడంలో రెవెన్యూ అధికారుల పాత్ర ఉందని వారు ఆరోపించారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించకపోతే విలువైన ప్రభుత్వ చెరువు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ చెరువును కాపాడుకునేందుకు తాము పోరాటానికి సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు.

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత

విశాలాంధ్ర - రంపచోడవరం: ఏజెన్సీలోని బాల్య వివాహాలు నిర్మూలించే బాధ్యత మనందరిపై ఉందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గానోరే పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ సమావేశ హాలులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీలోని 18 సంవత్సరాల నిడకుండా ఎవరైనా పెళ్లిళ్లు చేసినా అటువంటి వారిపై తగు చర్యలు తీసుకోవడం జరు గుతుందన్నారు. అమ్మాయిలకు అయితే 18 సంవత్సరాలు, అబ్బాయిలకు అయితే 21 సంవత్సరాలు వయస్సు తప్పకుండా ఉండాలన్నారు. ఈ సమావేశంలో అల్లూరి సీతా రామరాజు జిల్లా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్య లక్ష్మి, ఎపిడి వెలుగు ఎ.శ్రీనివాసరావు, డివిజనల్ డెవలప్మెంట్ అధికారి కె.కోటేశ్వరరావు, ఏడీఎం హెచ్ఓ జి.ప్రకాశం, సిడిపివోలు సంధ్యారాణి, ప్రసన్నలక్ష్మి, లక్ష్మీ, సుధా, దేవమణి, ఐసిడిఎస్ సూపర్డెంట్ రామచంద్రమూర్తి, వెలుగు డిపిఎం అపర్ణ పాల్గొన్నారు.

బాబు షూరిటీ... యువత భవిష్యత్తుకు గ్యారెంటీ

విశాలాంధ్ర - చింతపల్లి: బాబు షూరిటీ యువత భవిష్యత్తుకు గ్యారెంటీ అని టీడీపీ విశాఖ ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి కొట్టగుల్లి సుబ్బారావు అన్నారు. చింతపల్లి మండల పరిధిలోని కుడుము సారి పంచాయతీలోని వివిధ గ్రామాలలో బాబు షూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి మత్స్యరాస మణి కుమారితో విచ్చేసిన ఆయన కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. వైకాపా ప్రభుత్వంలో యువతను మద్యం దుకాణాలలో చిరుద్యోగులను చేసిన ఘనత ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఏడాదికి 4 లక్షల ఉద్యోగాలు చొప్పున ఐదేళ్ళలో 20 లక్షల ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత ఇదేత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ వంజంగి కాంతమ్మ, పాడేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొర్ర విజయ రాణి, మచ్చ రాజు, సాంస్కృతిక విభాగం నుంచి నాగబ్బాయి, వర్తన పిన దొర, స్థానిక మండల నాయకులు ముర్ల సత్తిబాబు, పాంగి చిట్టిబాబు, కే అప్పారావు, జర్త నర్సింగరావు, జె బాలరాజు, ఎం నాగేశ్వరరావు, ఎం చిన్నబాబు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాల ద్వారా మరింత లబ్ధి

విశాలాంధ్ర - మధుకవాడ: ప్రజలకు మరింత మేలుచేసే టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికి ప్రచారం చేయాలని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి,వార్డ్ క్లస్టర్ ఇంచార్జ్ మొల్లి లక్ష్మణరావు, వార్డ్ అధ్యక్షులు నాగోతి వెంకట సత్యనారాయణ పిలుపునిచ్చారు. భీమిలి నియోజకవర్గం మధురవాడ ఐదవ వార్డు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లా దారు. పోలింగ్ బూత్ ఇన్చార్జిలందరూ పార్టీ మేనిఫెస్టోలో పొందు పరిచిన శంఖారావం సూపర్ సిక్స్ పథకాలను రోజూ ప్రతి ఇంటికి వెళ్లి పార్టీ ముద్రించిన కరపత్రాలు, క్యాలెండర్లు ప్రజలకు అందించి పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో భీమిలి నియోజక వర్గ బీసీ సెల్ అధ్యక్షులు నమ్మి శ్రీను, టిడిపి ఐదవ వార్డ్ ప్రధాన కార్యదర్శి ఈగల రవికుమార్, ఉపాధ్యక్షులు వియ్యపు నాయుడు పోలింగ్ బూత్ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - చీడికాడ: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ కూరచా జయమ్మ అన్నారు. మండలంలోని బైలుపూడి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యం పట్ల తగు శ్రద్ధ తీసుకోవాలని కోరారు. పెదగొగాడ వైద్యురాలు మళ్ళా తరణి సుమారు 400 మంది రోగులకు పరీక్షలు చేశారు. ఈ కార్య క్రమంలో ఎంపీడీఓ ఉమామహేశ్వరి, సూపరింటెండెంట్ కామేశ్వర రావు, పంచాయతీ సెక్రెటరీ నాగేశ్వరావు, సర్పంచ్ జగిమొగ్గాల గంగతల్లి, సత్యనారాయణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పర్యటన విజయవంతం చేయండి

విశాలాంధ్ర - చీడికాడ: ఈ నెల 7న అనకాపల్లి జిల్లా పిసినికాడలో జరగనున్న చేయూత కార్యక్రమానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విచ్చేస్తున్నారని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీపీ కూరచా జయమ్మ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, మహిళా పోలీస్ వీఆర్వోలు వెలుగు సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమానికి మండలం నుండి 500 మందిని తీసుకురావాలన్నారు. వీరికి బస్సులు భోజనం సదుపాయం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఉమామహేశ్వరరావు, ఎంపీడీవో ఉమామహేశ్వరి, వైకాపా మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజబాబు, ఏపియం శ్రీనివాస్, ఏపీవో నాగ రాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ టీచర్ అయిన వేళ

విశాలాంధ్ర - చింతూరు: కలెక్టర్ విజయ సునీత మండలంలో విస్తృత పర్యటన చేశారు. చింతూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆరవ తరగతి విద్యార్థులకు మన విశ్వం అనే పాఠాన్ని సులభతరంగా విద్యార్థులకు బోధించి పాఠాలు చెప్పారు. చింతూరు మండలంలోని ఏహెచ్ఎస్ తులసిపాక, జెడ్‌పిహెచ్ఎస్, చిదు మూరు, చట్టి, పాఠశాలలను సందర్శించారు. అక్కడ పోలింగ్ స్టేషన్‌లను వసతులను పరిశీలించారు. కలెక్టర్ వెంట ఐటీడీఏ పీవో కావూరి చైతన్య, తహశీల్దార్ ఎండి.నాజీముల్లాషా, ఎంపీడీఓ చిట్టి తోటి రవిబాబు, ఎంఈఓ లక్ష్మీనారాయణ ఉన్నారు.

చిరు వ్యాపారులకు సాపిడ్ ఆర్థికసాయం

విశాలాంధ్ర - చింతూరు: చింతూరు కేంద్రంగా పనిచేస్తున్న సాపిడ్ స్వచ్ఛంద సంస్థ గిరిజన చిరు వ్యాపారులు తమ వ్యాపారం వృద్ధి చేసుకోవాలని, తద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంబన చేకూరాలని భావించి సంస్థ ఆధ్వర్యంలో 10 మంది మహిళలకు 15 వేలు చొప్పున ఆర్థికసాయాన్ని అందించారు. మరింత మందికి సహాయం చేస్తామని సంస్థ కోఆర్డినేటర్ ఎస్.కె అహ్మద్ అలీ ఒక ప్రకటనలో తెలిపారు.

నూకాంబిక ఆలయంలో సుద్దాల అశోక్ తేజ

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి గవరపాలెంలో వెలసిన శ్రీ నూకాంబిక అమ్మవారిని సినీ గేయరచయిత సుద్దాల అశోక్ తేజ దంపతులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వీరికి ఈఓ బండారు ప్రసాద్, ధర్మకర్తలు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి, సాలువాతో సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తలు బుద్ధ నర్సింగరాజు, కొండూరు రవీంద్రనాథ్, పీలా లక్ష్మి శ్రీనివాస్, మళ్ళవరపు ఈశ్వర్రావు, అర్చకులు యనమండ్ర శ్రీనివాసు, రిటైర్డ్ ప్రొఫెసర్ ముర్రు ముత్యాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అన్న సమారాధనకు గొర్లె ఆర్థిక సాయం

విశాలాంధ్ర - పెందుర్తి: సబ్బవరం మండలం మొగలిపురం శివారు గ్రామంలో అన్న సమారాధన కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం కన్వీనర్ గొర్లె రాము నాయుడు ఆర్థిక సాయం అందించారు. ఈ నెల 8న జరగనున్న శ్రీ అభయాంజనేయ తీర్థ మహోత్సవంలో పాల్గొనాల్సిందిగా గ్రామ కమిటీ సభ్యులు, ఆలయ నిర్వాహకులు రామునాయుడును ఆహ్వానించారు. పెందుర్తి బిజెపి కార్యాలయంలో ఆహ్వాన పత్రికను అందజేసి తీర్థం కార్యక్రమాలను ఆయనకు వివరించారు.

కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని కుమారపురం, ఎస్. నర్సాపురం, కందిపూడి, ఈదటం, పాల్మాన్ పేట, కేశవరం, శ్రీరాంపురం, పెంటకోట, గోపాలపట్నం, మాసాహెబ్ పేట, సత్యవరం, మంగవరం, అరట్లకోట గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వస్తే ఇందిరమ్మ అభయహస్తం ద్వారా ప్రతీ పేద కుటుంబానికి ప్రతి నెల రూ.5వేలు చొప్పున సంవత్సరానికి రూ. 60 వేలు అందిస్తారని తెలిపారు. అలాగే కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రానికి పది సంవత్సరాలు ప్రత్యేక హొదా ఇస్తారని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి మారుతి నారాయణ చక్రవర్తి, జిల్లా మహిళ ఉపాధ్యక్షురాలు సుంకర సూర్యవతి, ఎంకేఎం శేఖర్, తిర్యాదుల సరోజిని, సుంకర లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ సర్వీస్ స్కీంపై అవగాహన

విశాలాంధ్ర - పెదగంట్యాడ: నేషనల్ సర్వీస్ స్కీంపై ఆదిత్య డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో పెదగంట్యాడ నడుపూరు పాఠశాలలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి వెంకట రమణా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు, ఆరోగ్య, సామాజిక సంబంధిత విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి వచ్చిన ఆదిత్య విద్యార్థులను అభినందించారు.

ఏయు స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ విలీనం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ ("ఫిన్‌కేర్ ఎస్ ఎఫ్ బి")ని ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఏయూ ఎస్ ఎఫ్ బి") లో విలీనం చేయటానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆమోదం తెలిపినట్టు ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ వ్యవస్థాపకులు సంజయ్ అగర్వాల్, ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఎండి రాజీవ్ యాదవ్ వెల్లడించారు. ఈ విలీనం భారతీయ బ్యాంకింగ్ రంగంలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందన్నారు. ఈ సమ్మిళిత సంస్థ ఇప్పుడు ఒక కోటి కంటే ఎక్కువ కస్టమర్ బేస్, 43,500 కంటే ఎక్కువ మంది ఉద్యోగులు 25 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో 2,350 ఫిజికల్ టచ్‌పాయింట్‌ల నెట్‌వర్క్‌తో, డిసెంబర్ 31, 2023 నాటికి డిపాజిట్ బేస్ రూ. 89,854 కోట్లు బ్యాలెన్స్ షీట్ పరిమాణం రూ.1,16,695కోట్లు కలిగి ఉంటుందన్నారు. అక్టోబర్ 29, 2023న, ఏయూ ఎస్ ఎఫ్ బీ, ఫిన్‌కేర్ ఎస్ ఎఫ్ బీ రెండింటి యొక్క డైరెక్టర్ల బోర్డు విలీనాన్ని ఆమోదించిందన్నారు.

మారిటైమ్ రంగంలో విప్లవాత్మక మార్పులు రావాలి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖపట్నం పోర్టు అథారిటీ భాగస్వాముల సదస్సును మంగళవారం హోటల్ నోవాటెల్‌లో నిర్వహిం చింది. పోర్టు చైర్ పర్సన్ డా ఎం.అంగముత్తు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నూతన ఆలోచనలు, కార్యాచరణకు సంబంధించిన రోడ్ మ్యాప్‌ను వివరించారు. ఈ సందర్భంగా పోర్టు చైర్ పర్సన్ మాట్లాడుతూ భవిష్యత్తులో పోర్టు అభివృద్ధికి అవసరమైన బాట వేయడం, సామర్థ్యాన్ని పెంపొందించడం కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం, స్థిరత్వం, పోర్టు కనెక్టివిటీ పెంపొందించుకోవడం వంటి అంశాలను మెరుగుపరచుకోవాలసి ఉంటు ందని వెల్లడించారు. భాగస్వాముల యొక్క సహకారం ఎంత విలువైనదో ఈ సదస్సు స్పష్టం చేస్తోందని అన్నారు. మారీటైం విభాగం యొక్క అవసరాలను నెరవేర్చేందుకు పరిశోధన, అభివృద్ధి భాగస్వామ్యాలను నెలకొల్పడానికి పోర్టు చొరవ తీసుకుంటుందని చైర్ పర్సన్ వెల్లడించారు. అనంతరం పోర్టు సామాజిక బాధ్యతలో భాగంగా లబ్ధిదారులకు 3.63 కోట్ల రూపాయల విలువైన చెక్కులను చైర్ పర్సన్ పంపిణీ చేశారు. జివోఏపి సెక్రెటరి డా ఎన్.యువరాజ్, సీపీ రవిశంకర్, ప్రిన్సిపల్ కమీషనల్ ఆఫ్ కస్టమ్స్ ఎన్.శ్రీధర్, కెవిఎస్ ఆర్‌కే కిషోర్, సాంబశివరావు తదితరులు వీపీఏ పాత్రను అభినందించారు. ఈ కార్యక్రమంలో పోర్టు డిప్యూటీ చైర్ పర్సన్ దుర్గేష్ కుమార్ దూబె, ఐఆర్ టిఎస్, పోర్టు చీఫ్ విజిలెన్స్ అధికారి పిఎల్ స్వామి, ఐఓఎఫ్ ఎస్, పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్, పోర్టు విభాగాధిపతులు, అధికారులు పాల్గొన్నారు.

గర్భిణీలు ఆసుపత్రిలోనే ప్రసవం పొందాలి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జమాల్ భాష

విశాలాంధ్ర - సీలేరు: గర్భిణీలు విధిగా ఆసుపత్రిలోనే ప్రసవం పొందాలని, ప్రసవ సమయానికి ఐదు రోజులు ముందుగానే ఆసుపత్రిలో చేరాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జమాల్ భాష అన్నారు. మంగళవారం దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని లేబర్ రూమ్, వార్డులు పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలను ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఓపి, ప్రసవాల రిజిస్టర్‌ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ గర్భిణీలు తరచూ ఆసుపత్రికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. 9 నెలల కాలంలో ఒకసారైనా అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయించుకోవాలన్నారు. ప్రసవ సమయానికి ఐదు రోజులకు ముందుగా పీహెచ్‌సిలో చేరాలన్నారు. గృహాల్లో ప్రసవం పొందడం మంచిది కాదన్నారు. దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గరిష్టంగా నెలకు 30 నుంచి 50 ప్రసవాలు జరుగుతుండడం పై వైద్యాధికారి డీకే హిమబిందుని అభినందించారు. ఈ కార్యక్రమంలో దారకొండ వైద్యాధికారి డీకే హిమబిందు, డాక్టర్ నాగభూషణం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి గ్రేటెడ్ ఫైనాన్స్ భవన కాంప్లెక్స్ ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: రూ.25.30 కోట్ల వ్యయంతో నిర్మించిన ఇంటి గ్రేటెడ్ ఫైనాన్స్ భవన కాంప్లెక్స్‌ను రాష్ట్ర ఆర్థిక శాఖామాత్యులు బుగ్గన రాజేంద్రనాథ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ భవన సముదాయంలో ఆర్థిక శాఖకు సంబంధించిన అన్ని విభాగాలను తీసుకొని వచ్చే అవకాశం ఉందన్నారు. జిల్లా ట్రెజరీ శాఖ, పే అండ్ అకౌంటెంట్, ఆడిట్ విభాగం తదితర కార్యాలయాలను ఒకే కాంప్లెక్స్ లో ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి విశాఖ అభివృద్ధి ప్రణాళిక ప్రకటించారని, విశాఖ రానున్న కాలంలో పరిపాలన కేంద్రంగా మారనుందన్నారు. గడిచిన రెండేళ్లలో విశాఖలో అనే రకాల మౌలిక సదుపాయాలు ముఖ్యమంత్రి కల్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి శంషేర్ సింగ్ రావత్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఖజానా మరియు లెక్కల శాఖ సంచాలకులు ఎన్.మోహన్ రావు, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కి స్వాగతం పలికిన గాది శ్రీధర్ రెడ్డి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: విశాఖలో మంగళవారం జరిగిన పలు కార్యక్రమాలకు హాజరైన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఏపీ ప్రభుత్వ సలహాదారుడు గాది శ్రీధర్ రెడ్డి మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా గాది శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఏపీ స్కిల్ డెవలప్మెంట్, సిడాప్, ఉపాధి పొందిన యువతతో ఏర్పాటు చేసిన సమావేశంకు మంచి స్పందన వచ్చిందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా అందటంతో ప్రజలు సంతోషంగా ఉండటంతోపాటు నిరుద్యోగం సైతం తగ్గిందని ముఖ్య మంత్రికి తెలిపినట్లు శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు.

వికలాంగుల మహాగర్జన విజయవంతం చేయండి

విశాలాంధ్ర - చోడవరం: దివ్యాంగుల న్యాయమైన కోర్కెల సాధనకు ఈ నెల 9న అమరావతిలో జరుపనున్న 'వికలాంగుల మహగర్జన' జయప్రదం చేయాలని దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు దుగ్గిరాల రవి కుమార్ కోరారు. స్థానిక అంబేద్కర్ భవనంలో మంగళవారం ఉదయం నిర్వహించిన దుగ్గిరాల రవి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ఫించన్ రూ.6,000లు పెంచాలని, న్యాయమైన హక్కులు పరిష్కారం కోరుతూ వికలాంగుల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. అనంతరం "ఛలో అమరావతి" కరపత్రం ఆవిష్కరించారు. దివ్యాంగ సహోదరి, సహోదరులు ఈ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి సింగంపల్లి అనంతరావు, ఉపాధ్యక్షుడు జరగడం నాగభూషణ రావు, మాదిగ ఉద్యోగుల సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి. మూర్తా శ్రీనివాసరావు, కంల్లి వెంకట్రావు, సీనియర్ నాయకుడు అత్తోటి వజ్రబూషణం, మాది ఉద్యోగాల సంఘం జిల్లా సీనియర్ నాయకులు యర్రంశెట్టి వరప్రసాద్(రెల్లి హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు యర్రం శెట్టి వరప్రసాదరావు, సీనియర్ నాయకుడు వద్దాది చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రికి పక్కా ఏర్పాట్లు

విశాలాంధ్ర - రంపచోడవరం: ఈనెల 8వ తేదీ నుండి జరగబోయే శివరాత్రి ఉత్సవాలకు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ వారి కార్యాలయ సమావేశపు హాల్లో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో రంప శివాలయం కమిటీ సభ్యులతో శివరాత్రి ఉత్సవాలు ఏర్పాట్లపై రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్. ప్రశాంత్ కుమార్, అడిషనల్ ఎస్పీ జగదీష్ ఇరువురు కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్. ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ రంపచోడవరం డివిజన్లోని శివాలయాలలో శివరాత్రి ఉత్సవాలు నిర్వహణ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని సంబంధిత అధికారులను సబ్ కలెక్టర్ ఆదేశించారు. రంప చోడవరం మండలంలోని రంప గ్రామంలో వెలసిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో ఈనెల 8 నుండి 12వ తారీకు వరకు ఐదు రోజులపాటు జరిగే శివరాత్రి ఉత్సవాలకు భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీఎం హెచ్ ఓ జి. ప్రకాశం, డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవన్, ఎంపీడీవో హరికృష్ణ, సత్యనారాయణ, చలపతిరావు, డిప్యూటీ తాసిల్దార్ బి.రాజు, సర్కిల్ ఇన్స్పెక్టర్ వి.వెంకటేశ్వరరావు, సబ్ ఇన్స్పెక్టర్ మోహన్ రావు, ఆర్టీసీ డిఎం రమణ, ఆర్ బి డిఇ సతీష్, ఏపీ ఈపీడీసీఎల్ ఎఇ శ్రీనివాసరావు, రంప శివాలయం కమిటీ సభ్యులు, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీల నిర్మాణ పనులు ప్రారంభం

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల 3వ వార్డులో మంగళవారం డ్రైనేజీ నిర్మాణ పనులను మాడుగుల మండల వైసిపి అధ్యక్షులు పెదబాబు, సర్పంచ్ యడ్ల కళావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎనిమిది లక్షలతో సిమెంట్ డ్రైనేజీ నిర్మాణ పనులు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పొలిమేర విజయలక్ష్మి, పంచాయతీ వార్డు మెంబర్ బొడ్డేటి లీలావతి తదితరులు పాల్గొన్నారు.

సిఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్

విశాలాంధ్ర - ఎటపాక: 141 బిఎన్ సిఆర్ఫీఎఫ్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లా ఏటపాక పోలీస్ స్టేషన్ పరిధిలోని పాఠశాల/కళాశాల విద్యార్థులు, గ్రామస్థుల మధ్య క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం నిర్వహించారు. ఈ టోర్నమెంట్ 141 బిఎన్ సిఆర్పిఎఫ్ 2వ కమాండ్ కమల్వీర్ యాదవ్, జవహర్ నవోదయ విద్యాలయ ఏటపాక 02 జట్లు, ఏటపాక జిఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన 02 జట్లు, నెల్లిపాక, కన్నాయిగూడెం 2 జట్లు టోర్నమెంట్లో పాల్గొన్నారు. నెల్లిపాక క్రికెట్ జట్టు విజేత గా నిలిచింది. క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు సిఆర్పిఎఫ్ కమాండెంట్ రితేష్ ఠాకూర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సెకండ్ కమెండ్ కమలవిర్ యాదవ్, ప్రీతా, 141 బిఎన్, కామెండర్లు, జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీ లక్ష్మీ రాజం, అధికారులు, 141 బిఎన్ సిఆర్పిఎఫ్ పురుషులు పాఠశాల, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎం.కోడూరులో జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర - వి.మాడుగుల: మండలంలోని ఎం.కోడూరు గ్రామంలో సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎంపిపి తాళపురెడ్డి వెంకట రాజారామ్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో సుమారు 350 మందికి వివిధ సమస్యలకు సంబంధించి పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డి మీనా కుమారి, పిఎసిఎస్ అధ్యక్షులు గొల్లవిల్లి రాజేష్, పడాల అప్పలనాయుడు పాల్గొన్నారు.

10న మన్యం బంద్

విశాలాంధ్ర - గూడెం కొత్తవీధి: శత శాతం ఉద్యోగాల సాధనకై మార్చి 10వ తేదిన ఆదివాసీ గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ సంయుక్తంగా ఇచ్చిన మన్యం బంద్‌కు కలిసి వచ్చే ఇతర ప్రజాసంఘాల అధ్వర్యంలో జరుగుతున్న మన్యం బంద్‌ను ఆదివాసీ ప్రజలందరూ స్వచ్ఛందంగా రోడ్లపైకి వచ్చి విజయవంతం చేయాలని గిరిజన సంఘం జిల్లా నాయకులు గడుతూరి సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీల పక్షపాతి మన జగనన్న అని చెప్పుకునే అదికార ప్రజాప్రతినిధులు, ఆదివాసీలకు ఇవ్వవలసిన శత.శాతం ఉద్యోగాలు ఇవ్వకుండా ఉండడం గిరిజన పక్ష పాతికి తగునా అన్నారు. రాజకీయాలను ప్రక్కన పెట్టి భావితరాల భవిష్యత్తు కోసం జరుగుతున్న మన్యం బంద్‌కి మన్యంలో ఉన్న యువతీ, యువకులు వారి భవిష్యత్తు గురించి కలలు కంటున్న తల్లి తండ్రులరా 10వ తేదిన జరుగుతున్న మన్యం బంద్ లో స్వచ్ఛందంగా పాల్గోని విజయవంతం చేయాలని ఆదివాసి ప్రజానీకానికి ఆయన పిలుపునిచ్చారు.

వాహన యాత్ర ఓ కొత్త నాటకం: సీపీఎం

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: 2019 అసెంబ్లీ ఎన్నికల ముందు పాదయాత్రల పేరుతో అమలు కాని హామీలు ప్రజలకు ఇచ్చి ఓట్లు వేయించుకొని గెలిచి ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసారని, వాహన యాత్ర ఓ కొత్త నాటకం అనిసిపిఎం పార్టీ మండల కమిటీ ఆరోపించింది. మండల కేంద్రం రేకపల్లిలో మండల కమిటీ అత్యవసర సమావేశం నిర్వహించి జిల్లా కమిటీ సభ్యుడు పునేం సత్యనారాయణ మాట్లాడారు. గత ప్రభుత్వం పోలవరం భూ నష్టపరిహారం కింద ఎకరాకు లక్ష పదిహేను వేల రూపాయలు ఇచ్చిన వాటికి మూడున్నర లక్షల రూపాయలు అదనంగా ఇస్తామని చెప్పి హామీ ఇచ్చారు. ఒకరి కన్నా ఇచ్చారా అని ప్రశ్నించారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఒక్క కుటుంబానికి 10 లక్షల రూపాయలు ఇస్తామని 41.15 కాంటూరులో 19 గ్రామాల నిర్వాసితులకు గత సంవత్సరం ఇచ్చినటువంటి పరిహారంలో ఆరు లక్షలఎనభై ఆరు వేల రూపాయలు గిరిజనులకు ఆరు లక్షల ముప్పై ఆరువేల రూపాయలు గిరిజనేతరులకు ఇచ్చారని పది లక్షలు ఎందుకు ఇవ్వలేదు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. ఈ సమావేశంలో మండల కమిటీ సభ్యులు వద్లాది రమేష్, సొడే మల్లయ్య, గుండిపూడి లక్ష్మణ్, శీరపు తాతబాబు, నల్లారపు ప్రకాష్ పాల్గొన్నారు.

విశాఖను అభివృద్ధి చేసిన ఘనత సీఎం జగన్‌దే

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నంను రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా అభివృద్ధి చేసిన ఘనత సిఎంకు దక్కిందని ఏపీ ప్రభుత్వ సలహాదారుడు (స్కిల్ ట్రైనింగ్ జాబ్ ఫెయిర్) గాది శ్రీధర్ రెడ్డి అన్నారు.పి.ఎం.పాలెంలోని వైజాగ్ కన్వెన్షన్ సెంటర్లో స్కిల్ డెవలప్మెంట్, ఉపాధి, సీడాప్ ఆధ్వర్యంలో ఉపాధి పొందిన యువతతో జరిగిన సమావేశానికి ఏపీ సీఎం జగన్ మోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని పలువురు నేతలు కలిశారు.దీనిలో భాగంగానే దివంగతనేత రాజశేఖర్ రెడ్డి ప్రతిమను ఆయనకు బహుకరించారు. అనంతరం పలు విషయాలపై చర్చించినట్లు శ్రీధర్ రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్మెంట్ సలహాదారుడు సి.హెచ్ మధుసూదన్ రెడ్డి, చైర్మన్ కె.అజయ్ రెడ్డి, సీడాప్ చైర్మన్ ఎస్.శ్యాం ప్రసాద్ రెడ్డి తదతరులు పాల్గొన్నారు.

రావిలంకలో బాబు షూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ

విశాలాంధ్ర - దేవీపట్నం: మండలంలోని ఇందుకూరు పంచాయతీ ఎమ్.రావిలంకలో మండల టిడిపి అధ్యక్షులు మరిశెట్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బాబు షూరిటీ - భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం మంగళవారం తెలుగు తమ్ముళ్ళు నిర్వహించారు. ప్రతి గడప గడప కు వెళ్లి తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలకు చేపట్టే వివిధ పథకాలను వివరించారు. జగన్మోహన్ రెడ్డి హయాంలో ఉచితాలతో ప్రజల నడ్డి విరిగేలా నిత్యావసర సరుకుల ధరలు పెంచి పేదల బతుకులతో ఆటలాడుతున్న వైనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి చవలం శివ రామకృష్ణ, మాజీ మండల పార్టీ అధ్యక్షులు ముండ్రు మధుసూదనరావు, యూనిట్ ఇంచార్జి అడబాల వీరభద్రరావు, కేశవరపు చంద్ర కుమార్, కీర్తి గంగరాజు, ముచ్చి వీర వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నగరాల కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాస్‌కు ఘన సన్మానం

విశాలాంధ్ర - మల్కాపురం : నగరాల డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా పోతిన శ్రీనివాస్ ను నియమించిన సందర్భంగా యారాడ గ్రామ ప్రజలు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పోతిన శ్రీనివాస్ మాట్లాడుతూ నగరాల అభ్యుదయకు కృషి చేస్తానని, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాలు ప్రతి ఒక్కరికి అందెల కృషి చేస్తానని తెలిపారు. అలాగే బుధవారం మధురవాడలో ఏర్పాటుచేసిన నగరాల ఆత్మీయ సమావేశానికి ప్రతి ఒక్కరు హాజరుకావాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో మరుపిల్ల నూకరాజు, ములంపాక. అప్పారావు, మజ్జి వెంకటరావు, బోగవిల్లి. నాగభూషణం, మజ్జి కైలాష్, బోగవిల్లి నాగేశ్వరరావు డైరెక్టర్లు, గుజ్జరి లలిత, జగుపిల్ల అప్పలరాజు, పోతిన హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలో గల దారెల గ్రామ పంచాయతీ పరిధిలో గల పెటమలిపుట్ గ్రామంలో రూ.40 లక్షలు వ్యయంతో బ్రిడ్జి నిర్మాణనికి దారెల సర్పంచ్ పాంగి పాండు రంగ స్వామి, ఎంపీటీసీ పాంగి మల్లికార్జునరావు మంగళవారం పూజా కార్యక్రమాలు నిర్వహించి శంకుస్థాపన చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అల్లూరి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన సుమీత్ కుమార్ దృష్టికి పలుమార్లు బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతి పత్రాలు అందించామని దీంతో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయటంతో ఈరోజు బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం త్వరితగ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేసి వినియోగంలోనికి తీసుకొచ్చేందుకు ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో దారేల వైస్ సర్పంచ్ సోనియా, సావిత్రి, వంతల రెమో, బాలరాజు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలపై సమీక్ష

విశాలాంధ్ర - గంగవరం: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసేందుకు సెక్టోరియల్ ఆఫీసర్లు చర్యలు తీసుకోవాలని తహసిల్దార్ శ్రీమన్నారాయణ ఆదేశించారు. మంగళవారం తహసిల్దార్ కార్యాలయంలో సెక్టోరియల్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. వికలాంగులకు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, ఓటు వేసేందుకు వచ్చే ఓటర్లకు అవసరమైన మౌలిక సదుపాయాలు, పోలింగ్ సిబ్బందికి అవసరమైన సౌకర్యాలను పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ జిలాని భాష, ఎంపీడీవో కార్యాలయ పర్యవేక్షకులు సిద్దేశ్వర రావు, మండల వ్యవసాయ అధికారి విశ్వనాథం, ఈ ఓ పి ఆర్ డి నరసారావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం

విశాలాంధ్ర - పాడేరు: వైసీపీ పరిపాలనలో అన్ని వర్గాల ప్రజలు అన్యాయం జరిగిందని పాడేరు మండలం సుండ్రు పుట్టు 281 బూత్ ఇన్చార్జ్ కోడా కోటిబాబు అన్నారు. మంగళవారం సుండ్రు పుట్టు గ్రామంలోశంఖారావం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి తిరుగుతూ బాబుతో నేను అనే సూపర్ సిక్స్ క్యాలండర్లను పంపిణీ చేస్తూ సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరిస్తూ రిజిస్ట్రేషన్లు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుండ్రుపుట్టు గ్రామంలో ఏ వీధిలో చూసిన కనీసం అభివృద్ధి అనే జాడాలేదని ఈ వైసిపి పరిపాలనలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరిగిందని వచ్చే సర్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించి మన గ్రామ అభివృద్ధి చేసుకుందామని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రసాబాసగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



విశాలాంధ్ర - నర్సీపట్నం: నర్సీపట్నం మున్సిపాలిటీ సమావేశంలో వైసిపి, టిడిపి కౌన్సిలర్ లు మధ్య తీవ్ర వాదులాట, తోపులాట జరిగింది. నర్సీపట్నం మున్సిపల్ సమావేశంలో అధికార వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్లు కొట్టుకున్నంత స్థాయిలో వాదులాడు కున్నారు. పరస్పరం తోసుకున్నారు. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు తనయుడు 25వ వార్డ్ కౌన్సిలర్ రాజేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ ల మధ్య జరిగిన వాదులాట కాస్త సంయమనం కోల్పోయి గలాటా గా మారింది. 40 ఏళ్లలో మీరు చేయలేనిది ఐదేళ్లలో చేసి చూపించమని మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ అన్నారు. కొత్త వీధి రోడ్డు నిర్మాణంలో నిబంధనలు పాటించలేదని, టిడిపి కౌన్సిలర్ ముందుగా సమావేశంలో ప్రస్తావించారు. రక్షణ గోడలు నిర్మించుకుండా రోడ్డు వేయడం వల్ల రోడ్డు దెబ్బతింటుందని వాదించారు. పరిస్థితి అదుపు తప్పుతుండడంతో మున్సిపల్ చైర్ పర్సన్ సుబ్బలక్ష్మి, పోడియం దిగి కౌన్సిలర్ల మధ్యకు వచ్చి, సమావేశం జరిగేలా చూడాలని కోరారు. కొట్లాట సమయంలో తెలుగుదేశం పార్టీకి చెందిన మాజీ కౌన్సిలర్ పైల గోవిందరావు సమావేశ మందిరంలోకి వచ్చి, వైసిపి కౌన్సిలర్లతో వాదనకు దిగారు. కౌన్సిల్లో రావడానికి నీకున్న అర్హత ఏమిటని వైసిపి కౌన్సిలర్లు ప్రశ్నించారు. కౌన్సిల్ సభ్యులు కానీ మరి కొంతమంది కూడా సమావేశ మందిరంలోకి దూసుకువచ్చారు. ప్రజా సమస్యలను ప్రశ్నించే సమయంలో, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు అడ్డు తగలడం మంచి పద్ధతి కాదని, ప్రతిపక్ష టిడిపి కౌన్సిలర్‌లను కొట్టేస్తారా అంటూ 26వ వార్డ్ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి, చైర్పర్సన్ ను నిలదీశారు. ఆ తర్వాత జనసేన కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య మాట్లాడుతున్న సమయంలో వైసీపీ కౌన్సిలర్లు బయటకు వెళ్లిపోవడంతో సమావేశం అర్ధంతరంగా ముగిసింది.

మురళీకృష్ణ ఆలయం 17వ వార్షికోత్సవం



విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో వేములవలస గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ఆలయ ధర్మకర్త కీర్తిశేషులు పతివాడ వెంకటరమణ (బుల్లయ్య) నిర్మించిన మురళీకృష్ణ ఆలయం వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 7వ తేదీ వరకు ఆలయంలో ప్రత్యేకమైన పూజలు నిర్వహిస్తామని మొదటి రోజుగా భజన కార్యక్రమం, 2వ రోజు పంచామృత అభిషేకం, స్వామివారి కల్యాణం, 3 రోజులో భాగంగా మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం సుమారు 3000 మంది భక్తులకు ఏర్పాటు చేస్తున్నామని ఆలయ ఉత్సవ కమిటీ పతివాడ నర్సింగరావు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

బీసీ డిక్లరేషన్‌లో మండల బిసి నాయకులు

విశాలాంధ్ర - దేవీపట్నం: గుంటూరు జిల్లా మంగళగిరిలో టీడీపీ పార్టీ ఘనంగా నిర్వహిస్తున్న జయ హెూ బిసి డిక్లరేషన్ లో దేవీపట్నం మండలం నుంచి బీసీ నాయకులు పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ బీసీ లకు బీసీ సంక్షేమంకు పెద్ద పీట వేస్తుందని జనాభా లో అత్యధికంగా ఉన్న బిసి లను వైఎస్ఆర్ ప్రభుత్వం ఓటు బ్యాంకు గానే చూసింది తప్ప బీసీ సంక్షేమనికి చేసిందేమి లేదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి బిసి సెల్ ఉపాధ్యక్షులు జె.యస్.నగేష్, పార్లమెంటు బిసి సెల్ ఉపాధ్యక్షులు మచ్చు నాగేశ్వరరావు, పార్టీ ఉపాధ్యక్షులు మచ్చు త్రిమూర్తులు, యువత అద్యక్షులు లంక హరిచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

మానవత్వాన్ని చాటుకున్న వాలంటీర్

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం అయినాడ పంచాయతీకి చెందిన వాలంటీర్ కోరాడ రవి మానవత్వాన్ని చాటుకున్నారు. అయినాడ పంచాయితీ యాతపేట గ్రామానికి చెందిన బాడితిమాను సూరి గత కొంతకాలంగా టీబీ వ్యాధితో బాధపడుతూ కొద్ది రోజుల క్రితం విశాఖపట్నం జిల్లా ప్రభుత్వ టీబీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. పేషెంట్ సూరి ప్రభుత్వ టీబి హాస్పిటల్లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న వాలంటీర్ విశాఖపట్నం జిల్లా టీబి హాస్పిటల్ వద్దకు చేరుకొని పేషెంట్‌కు ఈనెల పింఛను అందించారు.